క్లుప్తంగా

ఉద్యాన నర్సరీ సందర్శన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యాన అధికారి సందీప్‌కుమార్

ఉట్నూర్‌రూరల్: జిల్లాలోని దస్నాపూర్ హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలలో రెండో సంవత్సరం ఇంటర్న్‌షిప్ విద్యార్థులు శనివారం ఉట్నూర్ ఐటీడీఏ ఉద్యాన నర్సరీని సందర్శించారు. పంటల సాగు, మొక్కల పెంపకం గురించి వారికి ఉట్నూర్ ఉద్యాన అధికారి సందీప్‌కుమార్ అవగాహన కల్పించారు. విద్యార్థులు నాలుగు వారాలపాటు ఉద్యాన నర్సరీలోనే ఉండి వివిధ పంటల సాగు విధానాలపై అధ్యయనం చేస్తారని ఉద్యాన అధికారి తెలిపారు. మొక్కల పెంపకం, అంటు కట్టడం, అలంకరణ మొక్కలు తయారీ, రైతు ఉత్పత్తి సంఘాలను పరిశీలిస్తారని పేర్కొన్నారు. హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మురళీ, అధ్యాపకులు అశ్విని, చాణక్య, ఉద్యాన నర్సరీ సాంకేతిక అధికారి అర్షిత తదితరులు ఉన్నారు.

క్రీడల్లో లక్ష్మణ్ ప్రతిభ



బహుమతి అందుకుంటున్న లక్ష్మణ్

బోథ్: జిల్లా కేంద్రంలో పోలీసు సిబ్బందికి నిర్వహించిన క్రీడ పోటీల్లో బోథ్ మండల కేంద్రానికి చెందిన హోంగార్డు బూస లక్ష్మణ్ షటిల్ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబర్చాడు. సింగిల్ విభాగంలో, డబుల్స్ విభాగంలో ద్వితీయ బహుమతి సొంతం చేసుకున్నాడు. జిల్లా ఎస్పీ గౌసం ఆలం చేతుల మీదుగా బహుమతి అందుకున్నారు.

విద్యార్థినులకు ముగ్గుల పోటీలు



ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

ఇంద్రవెల్లి: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మండల కేంద్రంలోని సన్‌సైన్ పాఠశాల విద్యార్థినులకు శనివారం ముందస్తుగా సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండెంట్ రాజగోపాల్ మాట్లాడారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ముందస్తుగా ముగ్గుల పోటీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచి విద్యార్థినులకు ఎంపిక చేసి జనవరి 26న బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నర్సయ్య, ఉపాధ్యాయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన రూపేష్‌రెడ్డి



సన్మానిస్తున్న రూపేష్ రెడ్డి

ఆదిలాబాద్: టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్‌ను ఆదిలాబాద్ యువజన కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు రూపేష్‌రెడ్డి శనివారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్లో ఆయనను కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ నియోజకవర్గంలోని రాజకీయాలపై చర్చించారు.

తప్పనిసరిగా టీకాలు వేయించాలి



పరీక్షలు చేస్తున్న డాక్టర్ శివకుమార్

కడెం: చిన్నారులకు తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి కె.శివకుమార్ అన్నారు. శనివారం మండలంలోని దిల్దార్‌నగర్ గ్రామంలో నిర్వహించిన ఇమ్యునైజేషన్ క్యాంప్ సందర్శించారు. ఈసందర్భంగా గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో వేణుగోపాల్, వైద్యసిబ్బంది మౌనిక, రాధ, జ్యోతి, రాజేశ్వర్ తదితరులున్నారు.



జామిడిలో సాగు చేస్తున్న గోబిపువ్వు

కూరగాయల సాగు అంతంతే..!

ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు రాథోడ్ గణేష్, ఇచ్చోడ మండలంలోని దాబా(కే)లో ఈ ఏడాది ఒక ఎకరంలో గోబిపువ్వు సాగు చేస్తున్నాడు. సరైన మార్కెట్ సౌకర్యం లేక పోవడంతో మండల కేంద్రంలో కిలోకు రూ. 20కే కిలో గోబిపువ్వు హోల్‌సెల్ ధరలకు విక్రయిస్తున్నాడు. మార్కెట్ సౌకర్యం ఉంటే కిలో రూ. 30 నుంచి రూ. 35 వరకు విక్రయించుకునే అవకాశం ఉంది. మార్కెట్ సౌకర్యం లేక పండించిన కూరగాయలకు గిట్టుబాటు ధరలు రావడంలేదని వాపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా మారుమూల ప్రాంతాల్లో కూరగాయలు సాగు చేసే రైతులు పరిస్థితి ఈ విధంగానే ఉంది.



- ఆసక్తి చూపని రైతులు
- మార్కెటింగ్ సౌకర్యం లేక ఇబ్బందులు
- ఇతర జిల్లాల నుంచి దిగుమతి

ఇచ్చోడ: జిల్లాలో ప్రతీ ఏడాది కూరగాయల సాగు తగ్గుతోంది. సాగుకు నేలలు అనుకులమైనప్పటికీ సమస్యలు, ప్రభుత్వం ప్రోత్సహం లేక పోవడం, నిల్వ ఉంచేందుకు కోల్డ్‌స్టోరేజీలు లేకపోవడంతో రైతులు పండించేందుకు ఆసక్తి చూపడం లేదు. మరోపక్క శివారు భూములన్ని రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మారిపోతుండడం కూడా కూరగాయల సాగు తగ్గడానికి కారణమవుతుంది.

నిల్వ చేసే సౌకర్యం లేక..

కూరగాయలు సాగు చేసే రైతులకు నిల్వ సదుపాయలు లేక ఇబ్బంది పడుతున్నారు. పండించిన కూరగాయలకుమార్కెట్లో సరైన ధర రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూరగాయలు నిల్వ చేసేందుకు కోల్డ్‌స్టోరేజీలు లేక పోవడంతో పండించిన కూరగాయలను తక్కువ ధరకే అమ్ముకోవాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. ప్రతీ ఏడాది పెరుగుతున్న కూరగాయల విత్తనాలు ధరలు, ఎరువులు, పురుగు మందులు, కూలీల ఖర్చులతో గిట్టుబాటు ధరలు లభించక పోవడంతో సాగుపై ఆసక్తి చూపడం లేదు.

మార్కెటింగ్ సమస్య..

జిల్లాలో కూరగాయలు సాగు చేస్తున్న రైతులకు మార్కెటింగ్ సమస్య వెంటాడుతోంది. జిల్లా కేంద్రం తప్ప కూరగాయల కొనుగోళ్ల మార్కెట్లు ఎక్కడ లేక పోవడంతో రైతులు నష్టపోతున్నారు. మారుమూల గ్రామాల్లో కూరగాయలు సాగు చేసే రైతులు పండిచిన కూరగాయలను తీసుకొని జిల్లా కేంద్రానికి వెళ్లలేక పోతున్నారు. దీంతో మండల కేంద్రాల్లోనే దళారులకు విక్రయిస్తున్నారు. దీంతో ఆరుగాలం కష్టపడి పండించిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

నెలకు 200 మెట్రిక్ టన్నులు దిగుమతి..

జిల్లాలో ప్రతీ నెల 258 మెట్రిక్ టన్నుల కూరగాయల అవసరం. కానీ జిల్లాలో నెలకు కేవలం 58 మెట్రిక్ టన్నుల కూరగాయలు మాత్రమే సాగు చేస్తున్నారు. దీంతో ప్రతీ నెల జిల్లాకు 200 వందల మెట్రిక్ టన్నులు కూరగాయలు ఇతర జిల్లాల నుంచి దిగుమతి అవుతున్నాయి. దీంతో రవాణా ఖర్చులు, మధ్య దళారులు కారణంగా కూరగాయల ధరలు ఎక్కువగా ఉంటున్నాయి.

జిల్లాలో కూరగాయల సాగు వివరాలు

సంవత్సరం	విస్తీర్ణం (ఎకరాల్లో)
2021- 22లో	2,911
2022- 23లో	1,465
2023- 24లో	1,601

అవగాహన కల్పిస్తున్నాం

కూరగాయల సాగు చేసే రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. కూగాయల సాగుతో రైతులు లాభాలు పొందవచ్చు. నీటి సౌకర్యం ఉన్న రైతులు కొంత మేర కూరగాయల సాగు చేసుకోవాలి.

– రమణ, ఉద్యానవన జిల్లా ఇన్‌చార్జి అధికారి

ఆదివాసీలకు ఏం చేశారో చెప్పాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఉట్నూర్‌రూరల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆదివాసీల అభివృద్ధికి ఏం చేశారో చెప్పాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం ఉట్నూర్ మండల కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో మాట్లాడారు. ఇటీవల ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రభుత్వంపై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. విహారయాత్రకు వచ్చినట్లు కాలక్షేపం కోసం పర్యటించిందని ఏద్దేవా చేశారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆదివాసీలను పూర్తిగా విస్మరించిందన్నారు. ఐటీడీఏలను పూర్తిగా నిర్వీర్యం చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పులకుప్పగా మార్చారని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదివాసీ సంఘాల నాయకులతో సమావేశమై అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నారన్నారు. వంద శాతం ఓవర్సీస్ స్కాలర్‌షిప్, ఇందిరమ్మ ఇళ్లు, వ్యవసాయ రైతులకు బోర్స్, పంప్ సెట్లు, కుమురం భీం జయంతి, వర్ధంతి వేడుకలను అధికారికంగా నిర్వహించడానికి నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. సమావేశంలో మండల అధ్యక్షుడు ఖయ్యుం, ప్యాక్స్ చైర్మన్ మ ప్రభాకర్ రెడ్డి, చంద్రయ్య, దాసండ్ల ప్రభాకర్, మర్సుకోల తిరుపతి, కలీంపాషా, లాజర్, భాగ్యలక్ష్మి, కళావతి, రాధాబాయి పాల్గొన్నారు.

పార్కింగ్ పనులు అడ్డగింత

- నీటి పారుదలశాఖ స్థలం అంటూ అడ్డుకున్న కాంగ్రెస్ నాయకులు

బోథ్: బోథ్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద పార్కింగ్ స్థలం కోసం చేపట్టిన పనులతో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య రాజకీయ వేడి రగిలింది. క్యాంపు కార్యాలయం వద్ద పార్కింగ్ స్థలం నిర్మాణం కోసం శుక్ర, శనివారాల్లో పనులు జరుగుతున్నాయి. అయితే నిర్మాణం చేపడుతున్న స్థలం నీటిపారుదల శాఖకు చెందిన స్థలమని బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, నాయకులు గొర్ల రాజు, చంటిలతో పాటు పలువురు నాయకులు శనివారం పనులను అడ్డుకున్నారు. ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా పనులను ఎలా చేస్తారని ప్రశ్నించారు. కాగా ఈ విషయమై కాంగ్రెస్ నేతలు జిల్లా కలెక్టర్‌తో పాటు, నీటి పారుదల శాఖ అధికారులకు సమాచారం అందించారు. నీటిపారుదల శాఖ జేఈ ప్రకాశ్ స్థలానికి చేరుకుని, వారితో మాట్లాడారు. పనులు వెంటనే నిలిపివేయాలని నాయకులు డిమాండ్ చేశారు.



నీటిపారుదల జేఈ ప్రకాష్‌తో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

అభివృద్ధిని అడ్డుకుంటున్నారు..

కాంగ్రెస్ నాయకులు బోథ్ నియోజకవర్గ కేంద్రంలో జరిగే అభివృద్ధిని అడ్డుకుంటున్నారు. బోథ్ మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, బీఆర్‌ఎస్ నాయకులు మండిపడ్డారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద వాస్తు పనులు, పార్కింగ్ పనుల చేపడితే కాంగ్రెస్ నాయకులు అడ్డుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు సౌకర్యం దృష్ట్యా, నీటిపారుదల శాఖ స్థలంలో పార్కింగ్‌తో పాటు పార్కును నిర్మిస్తే తప్పేంటని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు వారి రాజకీయ లబ్ధికోసం ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ముందుగా ఆరు గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న కంది శ్రీనివాస్ రెడ్డి

ఆదిలాబాద్: కాంగ్రెస్ చేరిన ఆటో యూనియన్ నాయకులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆయన కార్యాలయంలో పలువురు యూనియన్ నాయకులు, డ్రైవర్లు శనివారం కాంగ్రెస్‌లో చేరారు. కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అంతకుముందు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల వారు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ముందుకు వస్తున్నారన్నారు. దీంతో పార్టీ బలోపేతం అవుతుందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులందరూ విజయం సాధించేలా శ్రమించాలన్నారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు నుస్రత్ ఖాన్, జహీర్ రంజాని, బండారి సతీష్, ఆవుల వెంకన్న, కిజార్ పాషా, శంకరయ్య, లోక ప్రవీణ్ రెడ్డి, షౌకాత్, అశన్న, బూర్ల శంకరయ్య, అల్చెట్టి నాగన్న పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో నడవాలి



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

బోథ్: యువత సన్మారంలో నడవాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శనివారం మండలంలోని ధన్నూర్(బి) గ్రామంలో అంబేద్కర్ యూత్, పొచ్చెర గ్రామంలో హనుమాన్ రెడ్డి యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను ప్రారంభించారు. గెలిస్తే గర్వం చూపించకూడదని, ఓడితే నిరాశపడవద్దని యువకులకు సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బోథ్ మండలంలోని పొచ్చెర గ్రామంలో గల ప్రాథమిక ఆరోగ్యో ఉప కేంద్రాన్ని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శనివారం పరిశీలించారు. సమస్యలపై ఆరా తీశారు. అనంతరం కమ్యూనిటీ హాల్, కల్వర్టు నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు.

క్రీడలతో మానసికోల్లాసం

- ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్

నర్సాపూర్(జి): క్రీడలతో శారీరక దృఢత్వంతోపాటు మానసికోల్లాసం కలుగుతుందని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. నర్సాపూర్(జి) జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో కేడీఆర్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను శనివారం ప్రారంభించి మాట్లాడారు. ఆటలపోటీల్లో గెలుపోటములు సహజమని.. ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తి చాటాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు రాంకిషన్‌రెడ్డి, జెడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యులు సుభాశ్‌రావు, భైంసా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాజేశ్‌బాబు, మాజీ ఎంపీటీసీ మల్లేశ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గడ్డం ఇంద్రకరణ్‌రెడ్డి, కొంద్ర రమేశ్, గోపిడి గంగారెడ్డి, గొల్లమాడ మాజీ సర్పంచ్ చెన్న మహేశ్, ఏఎంసీ డైరెక్టర్ అజీమ్, టోర్నమెంట్ దాత కట్కం దత్తాత్రేయ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

చదువుతోనే ఉజ్వల భవిష్యత్



బహుమతులు అందిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

ఆదిలాబాద్: చదువుతోనే ఉజ్వల భవిష్యత్ సాకారం అవుతుందని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సెయింట్ జోసెఫ్ కాన్వెంట్ హై స్కూల్ డైమండ్ జూబ్లీ వేడుకలకు శనివారం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువు ఎంతో విజ్ఞానాన్ని అందిస్తుందన్నారు. విద్యాభ్యాసం చేయడంతో పాటు సహ పాఠ్య కార్యక్రమాలు, క్రీడల్లో సైతం ప్రతిభ కనబరచాలన్నారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు పాల్గొన్నారు.

గుండెపోటుతో కాంగ్రెస్ నాయకుడి మృతి

ఇచ్చోడ: మండల కేంద్రానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహిముద్‌ఖాన్(60) గుండెపోటుతో శుక్రవారం రాత్రి మృతి చెందారు. గత మూడు రోజుల కిత్రం అనారోగ్యానికి గురైన మహిముద్‌ఖాన్‌ను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ.. మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మహిముద్‌ఖాన్ తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీలలో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్నారు. గతంలో ఇచ్చోడ మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడిగా పనిచేశారు. ప్రసుతం కాంగ్రెస్‌లో ఇచ్చోడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న, బోథ్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆడే గజేందర్‌లు ఆయన భౌతికయాన్ని సందర్శించి ప్రగాఢ సానూభూతి తెలిపారు.

పాఠశాలకు విరాళం

బోథ్: మండలంలోని ధన్నూర్(బి) ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు శనివారం ఆదిలాబాద్‌లోని రెజోనెన్స్ పాఠశాల కరస్పాండెంట్ ప్రమోద్ రెడ్డి రూ. 10 వేలు విరాళం అందించారు. తాను పుట్టి పెరిగిన గ్రామంలో ఉన్న పాఠశాలకు మరింత విరాళం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. నగదును ప్రధానోపాధ్యాయులు రావుల శంకర్‌కు అందజేశారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలి

ఎదులాపురం: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ పోటీ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని గిరి ప్రసాద్ నవచేతన విజ్ఞాన సమితిలో శనివారం నిర్వహించిన పార్టీ రాష్ట్ర సమితి సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఐ ప్రజా సమస్యల కోసం కృషి చేస్తుందన్నారు. రాష్ట్రంలో అన్ని పథకాలు అమలు చేసే విధంగా పోరాటం చేస్తామన్నారు. నల్గొండలో ఈనెల 30న జరిగే సభకు పెద్ద ఎత్తున ఆదిలాబాద్ నుంచి శ్రేణులు తరలివచ్చేలా కృషి చేస్తామన్నారు.



మాట్లాడుతున్న ముడుపు ప్రభాకర్ రెడ్డి

కార్యక్రమంలో జాతీయ కార్యదర్శి అజయ్ పాషా, ప్రభాకర్, చాడ వెంకటరెడ్డి, కూనమినేని సాంబశివ రావు, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ అభ్యర్థుల నిరసన

ఆదిలాబాద్: లైబ్రరీ అధికారులు ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా గ్రంథాలయాన్ని మూసివేశారని నిరుద్యోగ అభ్యర్థులు ఆరోపించారు. శనివారం గ్రంథాలయానికి వచ్చిన పోటీ పరీక్షల అభ్యర్థులు ఇబ్బంది పడ్డారు. అధికారుల తీరుకు నిరసనగా ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న నిరుద్యోగ అభ్యర్థులు మాట్లాడుతూ గతంలో లైబ్రరీని సందర్శించిన కలెక్టర్ ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. కానీ ఇక్కడి అధికారులు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా లైబ్రరీని మూసి వేయడంతో గ్రామాల నుంచి వచ్చిన అభ్యర్థులకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. ఇక ముందు ఇలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలని కోరారు.



నిరసన తెలుపుతున్న నిరుద్యోగ అభ్యర్థులు

లీమ్‌గూడలో తాగునీటి కష్టాలు



తాంసి: మండలంలోని లీమ్‌గూడ గ్రామంలో తాగునీటి కష్టాలు ఇప్పుడే మొదలయ్యాయి. గ్రామానికి మిషన్ భగీరథ నీరు సరఫరా కాక గిరిజనులు నీటి కోసం అవస్థలు పడుతున్నారు. తాగునీటి కోసం బిందెలతో గ్రామ మహిళలు గ్రామంలో ఉన్న సంపు వద్ద నీటి కోసం బారులు తీరుతున్నారు. బోరుబావి నుంచి గ్రామంలోకి పైప్‌లైన్ ద్వారా నీటిని సరఫరా చేసి ట్యాంక్‌లో నిల్వ చేస్తున్నారు. అక్కడి నుంచి గ్రామస్తులు నీటిని తీసుకెళ్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మిషన్ భగీరథ నీటిని నిత్యం సరఫరా చేయాలని గిరిజనులు కోరుతున్నారు.

వైభవంగా ధనుర్మాసోత్సవాలు

- 108 గంగాళాల్లో పాయసం నివేదన

భైంసాటౌన్: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని పద్మావతి కాలనీలో ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం కూడారై మహోత్సవం నిర్వహించారు. ఉదయం ఆలయ ఆవరణలో వేదికపై అమ్మవార్ల సమేత స్వామివారి విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. 108 గంగాళాలల్లో పాయసం నైవేద్యం సమర్పించారు. అర్చకులు నక్షత్ర హారతి సమర్పించగా..భక్తులు భక్తిశ్రద్ధలతో తిరుప్పావై ప్రవచనాలు చేశారు.



పూజలు చేస్తున్న అర్చకులు

రెడ్డి ఉద్యోగుల సంక్షేమ సంఘ కార్యవర్గం

మామడ: జిల్లాకేంద్రంలోని రాజరాజేశ్వర కల్యాణ మండపంలో శనివారం రెడ్డి ఉద్యోగ సంక్షేమ సంఘ సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా రెడ్డి ఉద్యోగుల సంక్షేమ సంఘం (రేవా) జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడిగా పి.ప్రవీణ్‌రెడ్డి, జనరల్ సెక్రెటరీగా వై.ధర్మ జీవన్‌రెడ్డి, కోశాధికారిగా ఇ.ఆనందరెడ్డి, ఉపాధ్యక్షుడిగా సీహెచ్.మనోహర్‌రెడ్డి, మహిళా ఉపాధ్యక్షురాలిగా కె. హంసలత, జాయింట్ సెక్రెటరీగా ఇ.సంగీత ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు నిర్వాహకులు ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్ష, కార్యధర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, మురళి మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి